చివరి భూములకు నీరందించాలి: సీపీఎం


మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: డిస్ట్రిబ్యూటరీ కాల్వ- 40 చివరి భూములకు నీరందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కాల్వ చివరి భూములైన సర్వారం, ఇందుగుల, బొమ్మకల్, గురప్పగూడెం, తోపుచర్ల గ్రామాలకు సాగునీరందక పోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిండి మూడు నెలలు అవుతున్నా...ఇంతవరకు సాగునీటి సమస్య తీర్చకపోవటం అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్ధం పడుతోందన్నారు. చివరి ఆయకట్టుకు నీరందించకపోతే రైతులతో కలిసి కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, రొండి శ్రీనివాస్, పుల్లెంల శ్రీకర్, అంజయ్య, నాగమణి, నాగయ్య, శ్రీను, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బైపాస్ భూ సేకరణ సర్వే


సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: నల్గొండ మీదుగా వెళ్లే జాతీయరహదారి నిర్మాణంలో భాగంగా కొత్తగా నిర్మించే బైపాస్ రోడ్డు ఏర్పాటుకు ముమ్మరంగా భూ సేకరణ సర్వే కొనసాగుతోంది. బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.516 కోట్ల నిధులు మంజూరు చేయడంతో సర్వే పనులు ఊపందుకున్నాయి. మొత్తం 14కి.మీ మేర నిర్మించనున్న నాలుగులైన్ల రోడ్డుకు 150 అడుగుల పరిధితో భూ సేకరణ చేపట్టారు. రైతులు, ప్లాట్ల యజమానుల సమక్షంలోనే బుధవారం రెవెన్యూ అధికారుల బృందాలు సర్వే కన్సల్టెన్సీ సంస్థ ప్రతినిధులు మర్రిగూడ నుంచి మునుగోడు హౌసింగ్‌బోర్డుకాలనీ వరకు సర్వే పూర్తి చేశారు. మరో రెండు మూడు రోజుల్లో సర్వే చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

యూరియా.. ఎందుకు అమ్మడం లే..!


సహకార సంఘంలో ఎరువుల కోసం బారులు తీరిన రైతులు (పాతచిత్రం)

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో వరి, పత్తి, ఇతర పంటల సాగుకు వివిధ రకాల ఎరువులు వినియోగిస్తున్నారు. వీటిని గరిష్ఠ చిల్లర (ఎమ్మార్పీ) ధరకు లభ్యమయ్యే ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లో రైతులు కొనుగోలు చేసేలా వెసులుబాటు కల్పించారు. పీఏసీఎస్‌లలో అన్ని రకాల ఎరువులు విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నా.. కొందరు సీఈవోలు పట్టించుకోవడం లేదు. దీంతో దూరంలో ఉన్న పట్టణాలు, మండల కేంద్రాలకు వెళ్లి అధిక ధరకు ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలతో పాటు రవాణా ఛార్జీల భారం పడుతోందని వాపోతున్నారు.

ఉచిత రవాణా సౌకర్యం ఉన్నా..

సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా 115 పీఏసీఎస్ కేంద్రాలున్నాయి. ఈ సంఘాలకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఎరువులను ఉచితంగా రవాణా చేస్తారు. ఈ అవకాశం ఉన్నప్పటికీ ఉమ్మడి జిల్లాలో 22 సహకార సంఘాల వారు యూరియా తీసుకొచ్చి విక్రయించడం లేదు. దీంతో ఆ సంఘాల పరిధిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డీలర్లు యూరియా విక్రయించాలంటే వారే రవాణా ఖర్చులు భరించి దుకాణానికి తెచ్చుకోవాలి. దీంతో ప్రైవేటు వ్యాపారులు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పీఏసీఎస్‌ల వివరాలు

జిల్లా	పీఏసీఎస్‌లు	ఎరువులు విక్రయించేవి	విక్రయించనవి
నల్గొండ	43	38	5
సూర్యాపేట	47	36	11
యాదాద్రి	25	19	6

కమీషన్‌పైనే దృష్టి

అన్ని సంఘాల్లో డీఏపీ, 20-20, భారత్, ఐఎఫ్ఎఫ్‌సీవో, తదితర ఎరువులను విక్రయించాల్సి ఉంది. కానీ, ఇచ్చిన ఎరువులు మాత్రమే తీసుకోవాలని రైతులకు నిబంధన పెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే రూ.కోట్లు కమీషన్ తీసుకుంటున్న సహకార సంఘాల నిర్వాహకులు యూరియా సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కారణాలు ఇలా..

- ★ గోదాము లేకపోవడంతో ఎరువులకు స్థలం దొరక్క పీఏసీఎస్ నిర్వాహకులు నిల్వ చేసుకోవడం లేదు.
- ★ యూరియా విక్రయించేందుకు, దిగుమతి, ఎగుమతి నిల్వ వివరాలు రాసుకునే సిబ్బంది, హమాలీలు లేకపోవడం.
- ★ ప్రభుత్వం నుంచే సరైన (దొడ్డు రకం) యూరియా సరఫరా కాకపోవడం.

విక్రయించాలని ఆదేశించాం

– పద్మ, డీసీవో, సూర్యాపేట

అన్ని సహకార సంఘాల్లో ఎరువులు విక్రయించాలని ఆదేశించాం. కొన్ని సంఘాల్లో విక్రయించడం లేదని మా దృష్టికి వచ్చింది. వెంటనే వాటిని తనిఖీ చేసి అందుకు గల కారణాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వచ్చే యాసంగిలో అన్ని సహకార సంఘాల్లో విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

కొత్త పాఠం ప్రారంభం..!


కతాల్‌గూడ ఎంపీపీఎస్‌లో బోధిస్తున్న కొత్త ఉపాధ్యాయురాలు కె.శైలజ

కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. తమకు కేటాయించిన పాఠశాలల్లో బోధన మొదలుపెట్టారు. మొదటి రోజు ఉత్సాహంగా పిల్లలను, పాఠశాలలో ఉన్న తోటి ఉపాధ్యాయులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. కన్నవారి కలలను నిజం చేస్తూ ఉద్యోగంలో చేరిన వారు తమ కష్టానికి ఫలితం దక్కిందంటున్నారు. చేసే పనిలోనూ మంచి పేరు సాధించాలన్న భావన వారిలో వ్యక్తమవుతోంది.

– నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే:

■ జిల్లాలో డీఎస్సీ- 2024లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 15న నల్గొండలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం ప్రారంభమైన పోస్టింగ్‌ల కేటాయింపు కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 6.30 గంటల వరకు సాగింది. జిల్లాలో మొత్తం 535 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందచేసి పాఠశాలల్లో చేరాలని సూచించారు. ఎస్‌జీటీలో ఇద్దరు, లాంగ్వేజి పండిట్‌లో ఒకరు కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు.

చాలా సంతోషంగా ఉంది: కె.శైలజ

నల్గొండ సమీపంలోని ఎంపీపీఎస్ కతాల్‌గూడ పాఠశాలలో కొత్తగా ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరాను. మొదటి రోజు బోధన చాలా ఆనందాన్ని నింపింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించినందుకు ఎంతో సంతోషంగా ఉంది. పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి కృషిచేస్తా.

పేదలకు సేవ చేసే అవకాశం:

– కమ్మంపాటి మహేష్‌గౌడ్



నేను దాదాపు 8 ఏళ్లుగా ప్రైవేట్ పాఠశాలల్లో పని చేశా. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్ ఉపాధ్యాయుడిగా ఎంపికై పాఠశాలలో చేరాను. మొదటి రోజు చాలా ఆనందం కలిగింది. ప్రైవేట్ పాఠశాలల్లో బోధించడంతో బోధనపై పట్టు ఉంది. మోత్కూరు మండలం విజిలాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమయ్యా. వృత్తి పరంగా మంచి బోధన అందించి విద్యార్థులను తీర్చిదిద్దుతా.

పత్తి కొనుగోళ్లకు సన్నాహాలు

○ ఉమ్మడి జిల్లాలో 40 కేంద్రాల ఏర్పాటు


భానుపురి, న్యూస్‌టుడే:

ఉమ్మడి నల్గొండ జిల్లాలో పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు భారత పత్తి సంస్థ(సీసీఐ) సిద్ధమైంది. ఏటా దళారులకు విక్రయించి నష్టపోతున్న రైతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో మొత్తం 40 సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. పత్తి సాగు పెరగడంతో కేంద్రాలనూ అధికంగా ఏర్పాటుచేస్తున్నారు. వీటిల్లో రైతులు దూది విక్రయించుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పించనుంది. ఈ సారి పత్తికి మద్దతు ధర పెంచి క్వింటాకు రూ.7,521 చెల్లిస్తుండటం అనుకూలించే అంశం.


గతేడాది సూర్యాపేటలోని సీసీఐ కేంద్రానికి రైతులు విక్రయానికి తీసుకొచ్చిన పత్తి (పాతచిత్రం)

వారం రోజుల్లో ప్రారంభం

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 7.18 లక్షల ఎకరాల్లో ఈసారి అన్నదాతలు పత్తిసాగు చేపట్టారు. ఇప్పటికే మొదటి విడతగా దూది ఏరుతున్నారు. ముందుగా పత్తి ఏరిన కొందరు రైతులు కేంద్రాలు లేక దళారులకు విక్రయించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో వారం రోజుల్లో పత్తి కొనుగోళ్లు ప్రారంభించేందుకు సీసీఐ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. జిన్నింగ్ మిల్లుల్లోనూ కొనుగోళ్లు జరిపేలా కేంద్రాలు ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చి రైతులు ఇబ్బందులు పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నారు. సరకు తెచ్చిన వెంటనే కొనుగోళ్లు జరిగేలా యంత్రాలను సిద్ధం చేస్తున్నారు.



పత్తి సాగు (ఎకరాల్లో..)
ఏర్పాటుచేసే కొనుగోలు కేంద్రాలు

తేమ లేకుండా తీసుకురావాలి

– ఆర్.సంతోశ్‌కుమార్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేట

సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకొచ్చే రైతులు తేమ లేకుండా చూడాలి. నాణ్యమైన దూది తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దు.

నేటి నుంచి ఉర్సు


ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు

నీలగిరి, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా తెలంగాణలోని అన్ని ప్రాంతాల నుంచి భక్తులు వచ్చే సయ్యద్ షా లతీఫుల్లా ఖాద్రీ దర్గా ఉత్సవాలను తిలకించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. సౌకర్యాలను బుధవారం ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి తదితరులు పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు, ముతవలీలు సమన్వయంతో ఉర్సు ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందో బస్తు ఉంటారని చెప్పారు. పురపాలిక అధికారులు శానిటేషన్, తాగునీరు, ఏర్పాటు చేస్తారని తెలిపారు. నిరంతరం విద్యుత్తు సరఫరా అయ్యేలా చూడాలని ఆశాఖ అధికారులతో చెప్పారు. గురువారం గంధం ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పురపాలిక కమిషనర్ ముసాబ్ మహ్మద్, తహసీల్దార్ శ్రీనివాస్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎన్ఎం కోర్సుకు దరఖాస్తులు

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ(జీఎన్ఎం) కోర్సులో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పూర్తి వివరాలకు జల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మూల మలుపుల్లో.. పొంచి ఉన్న ప్రమాదం

శాలిగౌరారం, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులపై మూల మలుపుల వద్ద దట్టంగా పెరిగిన కంపచెట్లతో ఆర్అండ్‌బీ రహదారిపై ప్రయాణం ప్రమాదం పొంచి ఉంది. మూల మలుపు వద్ద పగలు, రాత్రి కంప చెట్లు అడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించక ద్విచక్రవాహనదారులు, భారీ వాహనాలు సైతం ఢీకొని కొంత మంది ప్రాణాలు పోయాయి. మరికొంత మంది తీవ్రగాయాలపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి, ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు


శాలిగౌరారం- నకిరేకల్ ప్రధాన రహదారి వల్లాల శివారులో కంపచెట్లతో ప్రమాదకరంగా మలుపు


ఉపాధి వేట.. జలకాలాట

శాలిగౌరారం మండలం ఎన్జీ కొత్తపల్లి చెరువు అలుగుపోస్తుంది. ఆంధ్రా నుంచి బాతులు సాదుకుంటూ బతుకుదెరువు కోసం వలస వచ్చిన వారు చెరువులోకి బాతులను వదిలేశారు. దీంతో అవి సంతోషంగా జలకాలాడుతున్న చిత్రం'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కింది. – శాలిగౌరారం, న్యూస్‌టుడే.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు పెంచాలి: డీఎంహెచ్‌వో


పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

కేతేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. కేతేపల్లి పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీఎంహెచ్‌వో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకుంటే మెరుగైన వైద్య సేవలు అందడంతోపాటు ఆర్థికంగా ఇబ్బంది పడ్డారనే విషయాన్ని సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అమలు చేస్తున్న సేవలను తెలియజేసి ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.వేణుగోపాల్‌రెడ్డి, కేతేపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం


ఫరీదోద్దిన్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: పార్టీ కార్యకర్తలను అన్నివిధాలుగా ఆదుకుంటామని మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, మహమూద్ అలీ అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు ఫరీదోద్దిన్ అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. మలి విడత తెలంగాణ ఉద్యమంలో ఫరీదోద్దిన్ పాత్ర కీలకమైందన్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో భారాస రాష్ట్ర కార్యదర్శి చాడా కిషన్‌రెడ్డి, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, దేవేందర్, సింగం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తవత్సలుడికి భక్తుల ఆరాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి పుణ్యక్షేత్రంలో బుధవారం స్వయంభువులైన పంచనారసింహులను ఆరాధిస్తూ చేపట్టిన ఆస్థాన, ఆర్జిత పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయ ద్వారాలు తెరిచి మూలవరులను హారతితో కొలిచారు. పాలతో నిజాభిషేకం నిర్వహించాక తులసీపత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వర్ణ కవచమూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ, సువర్ణ పుష్పార్చన క్రతువు కొనసాగించారు. ఉగ్ర నరహరిని శాంతింపజేసేందుకు శ్రీసుదర్శన నారసింహహోమం మండపంలో నిర్వహించారు. లోక కల్యాణార్థమై శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణం ఆలయ ఆచారంగా చేపట్టారు. దర్బార్ సేవోత్సవంలో నిత్యాదాయాన్ని వెల్లడించారు.

శివారు.. ముందుకు రారు..!



ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నవారు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవాలని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్న ఈ ప్రాంతం కోదాడ పురపాలక పరిధిలోనిది. దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో పుర అధికారులే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

కోదాడ, న్యూస్‌టుడే:

ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ పథకాన్ని గత ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టింది. చాలా మంది దరఖాస్తు చేసుకున్నా.. మొదట్లో అవి పరిష్కరించేందుకు జాప్యం జరిగింది. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. మూడు నెలల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించింది. కానీ క్షేత్రస్థాయిలో ప్లాట్ల యజమానులు తమ దరఖాస్తు పరిష్కారానికి ముందుకు రాని పరిస్థితి నెలకొంది.

20 శాతమే పూర్తి..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పురపాలికల్లో సుమారు రెండు లక్షల వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 20 శాతంలోపే పరిష్కారమయ్యాయి. చాలా మంది ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం.. పట్టణానికి దూరంగా ఉండటం, శివారు ప్రాంతాల్లో అభివృద్ధి లేకపోవడం, ఇప్పట్లో ఇంటి నిర్మాణాలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడమే.

★ ఖాళీ స్థలానికి ప్రాంతాల వారీగా ప్రస్తుత మార్కెట్ ప్రకారం రూ.4 వేల నుంచి రూ.లక్ష వరకు ఫీజు చెల్లించాల్సి వస్తుంది. చాలా మంది కొన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడం, ధర తగ్గడం, ఇప్పుడు ఇళ్లు నిర్మించినా ప్రయోజనం లేదని భావించి ఫీజు చెల్లించడం ఆర్థిక భారం అవుతుందని క్రమబద్ధీకరణకు ముందుకు రావట్లేదు. పట్టణం నడిబొడ్డున, ఇళ్ల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల యజమానులు మాత్రమే ముందుకు వస్తున్నారు.


కోదాడలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారుల ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పురపాలికల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు..

పురపాలిక	దరఖాస్తులు	పరిష్కారం	పెండింగ్
నల్గొండ	36,116	7,153	21,789
కోదాడ	16,748	3,172	13,576
మిర్యాలగూడ	14,334	6,097	8,237
సూర్యాపేట	35,631	12,392	23,239
హుజూర్‌నగర్	4,414	112	4,300
నేరేడుచర్ల	3,131	127	2,520
తిరుమలగిరి	6,018	1,123	4,880
దేవరకొండ	5,022	242	3,224
నకిరేకల్	6,941	75	5,937
చిట్యాల	3,208	66	2,876
చండూరు	3,619	296	2,831
హాలియా	3,418	135	3,281

అవగాహన కల్పిస్తున్నాం:

– రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలి. చాలా మంది ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. వారికి ఫోన్లు చేసి అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పుడు క్రమబద్ధీకరణ చేసుకుంటే నిర్మాణాలు చేపట్టే సమయంలో ఇబ్బందులు తలెత్తవు. గడువు ముగియక ముందే దరఖాస్తుదారులు ముందుకు రావాలి.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందండిలా..

మీకోసం

ఆలేరు, న్యూస్‌టుడే: విద్య, ఉపాధి, ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లేవారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ఇదే క్రమంలో వారికి ఆయా దేశాల్లోని పరిస్థితులు, అవసరాల రీత్యా డ్రైవింగ్ లైసెన్సుల అవసరం అవుతోంది. విదేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో విదేశాలకు వెళ్లేవారిలో చాలా మంది అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ (ఐడీఎల్) కోసం రవాణాశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. సరైన అవగాహన లేక దళారులను ఆశ్రయిస్తూ అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ పొందే విధానంపై కథనం.



భువనగిరిలోని రవాణా శాఖాధికారి కార్యాలయం



భారత్‌లో ఏదైనా గుర్తింపులో జారీ అయిన అంతర్జాతీయ డ్రైవింగ్ పర్మిట్ (పాతచిత్రం)



అమెరికాలో జారీ చేసే డ్రైవింగ్ లైసెన్స్ కార్డు నమూనా



యూఏఈలో జారీ అయిన డ్రైవింగ్‌లైసెన్స్

ఉన్నత విద్య కోసం...

ఉన్నత విద్య అభ్యసించడానికి అమెరికా, గ్రేట్ బ్రిటన్, కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, రష్యా తదితర దేశాలకు వెళుతున్నారు. ఆయా దేశాలకు వెళ్లినవారిలో కొందరు అక్కడే స్థిర పడుతుండగా, మరికొందరు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆయా దేశాలలో కారు తప్పని సరైంది. ఈ క్రమంలో చాలామంది ఐడీఎల్ తీసుకుంటున్నారు.

వీసాను జతచేయాలి..

◆ అంతర్జాతీయ లైసెన్స్ పొందాలంటే ముందుగా స్వదేశంలో డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. ఐడీఎల్‌కు దరఖాస్తు చేసే సమయంలో ఇక్కడ తీసుకున్న డీఎల్‌తో పాటు పాస్‌పోర్టు (గడువు 6 నెలలైనా ఉండాలి), మనం ఏ దేశానికి వెళుతున్నామో ఆ దేశానికి సంబంధించిన వీసాను జతచేయాలి.

◆ వీసా త్వరగా వస్తుందనుకుంటే అందుకు సంబంధించిన ఆధారాలు అందజేయాలి. ఆరోగ్య రంగా వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. ఫాం-ఎ జతచేసి పూర్తి వివరాలతో స్లాట్ బుక్ చేసుకోవాలి. రుసుం ఆన్‌లైన్‌లో చెల్లించాలి. కేటాయించిన తేదీన ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఐడీఎల్ జారీ చేస్తారు. ◆ నల్గొండ ఉమ్మడి జిల్లాలో 1.1.2020 నుంచి 30.9.2024 వరకు సుమారు 1,700 మంది వరకు అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకున్నారు. నల్గొండ జిల్లాలో 720, సూర్యాపేట 600, యాదాద్రి భువనగిరి జిల్లాలో 380 వరకు తీసుకున్నారు.


లెర్నింగ్ లైసెన్స్ మాదిరిగానే..

రాష్ట్ర రవాణాశాఖ జారీచేసే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. దీని ఆధారంగా ఆయా దేశాలలో వాహనాలు నడపడానికి అనుమతిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే మనదేశంలో పొందిన ఐడీఎల్ ఆయా దేశాలలో లెర్నింగ్ లైసెన్స్‌లా ఏడాది కాలం చెల్లుబాటులో ఉంటుంది. అక్కడి నిబంధనలకు లోబడి గడువులోగా అక్కడి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.


అమెరికాలో ఇలా...

అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే కఠిన నిబంధనలు ఉంటాయి. మనదేశంలో మాదిరిగానే లెర్నింగ్ లైసెన్స్ తీసుకోవడానికి ముందు టెస్ట్ ఉంటుంది. అందులో ఉత్తీర్ణులైతేనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. ఆనంతరం డ్రైవింగ్ స్కూల్లో శిక్షణ పొందాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం కూడా టెస్ట్ రాయాల్సి ఉంటుంది. డ్రైవింగ్ నిర్వహించేప్పుడు పక్కన ఎంవీఐ కూర్చుని మన డ్రైవింగ్‌ను పరిశీలిస్తారు. సెన్సార్ ద్వారా మన బోదనను పరిశీలించడంతో పాటు ఫొటోలు కూడా తీస్తారు. డ్రైవింగ్ చేస్తున్నపుడు పొరపాట్లు చేస్తే వాటిని రుజువులుగా చూపుతూ లైసెన్స్ జారీని తిరస్కరిస్తారు.

విలువలు నేర్పుదాం..!



'మనం బాగున్నప్పుడు లెక్కలు మాట్లాడి. కష్టాల్లో ఉన్నప్పుడు విలువలు మాట్లాడకూడదు.' – సినీ రచయిత త్రివిక్రమ్



'వ్యాపార నిర్వహణ విషయంలో ఆధిపత్యం, సంపద గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. విలువలు, విశ్వసనీయత పైనే ప్రధానంగా దృష్టి పెట్టాను.' – రతన్ టాటా

◆ నేడు 'ప్రపంచ విలువల దినోత్సవం'

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు కేవలం పుస్తకాలు, మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలు, డబ్బే జీవితం అనుకుంటున్నారు. అలా అనుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చిన్నారుల మనసులను మార్చేస్తున్నారు. దీంతో కొంత వయసొచ్చాక విద్యార్థులకు మంచి, చెడులు, బంధాలు, బంధుత్వాలు, మానవత్వం.. వంటి వాటిపై విచక్షణ కోల్పోయి, మరమనుషుల్లా మారిపోతున్నారు. దీన్ని మార్చాలనే ప్రజలకు విలువల ప్రాధాన్యం తెలిపేందుకు యునైటెడ్ కింగ్‌డమ్ 2016 నుంచి ఏటా అక్టోబరు 17న 'ప్రపంచ విలువల దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

పాఠశాలల్లోనే బీజం పడాలి..

సమాజం, మానవీయత, బంధాలు, మంచి చెడులపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలే అనువైన ప్రదేశం అని నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మంచి విలువలు, కట్టుబాట్లు అలవరచడం ద్వారా సమాజంలో అనేక సామాజిక రుగ్మతలను నియంత్రించవచ్చని చెబుతున్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు, తోబుట్టువులు, కట్టుకున్న వారు, పిల్లలు, బంధువులు, మిత్రులతో ఎలా మసలుకోవాలి.. వారి కంటే డబ్బు, ఇతర ఆస్తులు ఏవీ ముఖ్యం కాదనే విషయం విద్యార్థుల్లో బలంగా నాటుకుపోవాలి.

❑ ప్రజల్లో విలువలు దిగజారితే ఎన్నో అనర్థాలు జరుగుతాయి. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక ఘటనలు దీనికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో కొందరు విలువలు మరిచి చేసిన ఘటనలివీ..

❑ వేములపల్లి మండలంలో ఓ భర్త భార్యపై అనుమానం పెంచుకుని ఆమెను కాలువలో తోసి హత్య చేశాడు.

❑ ఈ ఏడాది మేలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని ఓ గ్రామంలో డబ్బుల కోసం తల్లి అంత్యక్రియలు జరగకుండా కుమారుడు అడ్డుపడిన ఘటన విస్మయగొలిపింది.

❑ 2021లో సూర్యాపేట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ చదివి విదేశాలకు వెళ్లొచ్చిన ఓ కుమారుడు డబ్బు ఇవ్వలేదని కన్నతండ్రిని బకెట్‌లో కొట్టి హత్య చేశాడు.

❑ 2019లో సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంకు చెందిన ఓ తండ్రి భార్యపై కోపంతో నాలుగేళ్ల కుమారుడిని మెడ కొరికి, పీక్కుసుంతో గుచ్చి అతి కిరాతకంగా హత్య చేశాడు.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు..

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు:	4,206
ఆరేళ్ల లోపు చిన్నారులు:	1,64,527
మొత్తం పాఠశాలలు:	3,210
పాఠశాల విద్యార్థులు:	2,11,009
మొత్తం గురుకులాలు:	84
గురుకులాల్లోని విద్యార్థులు:	45,360

ఫోన్‌లో మునిగిపోతున్నారు..



డాక్టర్ రాజశేఖర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు, కోదాడ

సాధారణంగా పిల్లల్లో విలువలు పెంపునకు కుటుంబమే కేంద్రం. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉండడంతో తల్లిదండ్రులు, తాతలు, నానమ్మ, అమ్మమ్మలు పిల్లలకు వైతిక విలువలు బోధించేవారు. అయితే నేటి పరిస్థితుల్లో ఇంట్లో ఉన్న నలుగురిలో తలో పనిలో.. ఫోన్‌లో మునిగి పోతుండడంతో చిన్నారుల్లో విలువలు కనుమరుగవుతున్నాయి.

మైహోం సంస్థకు అవార్డు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: సిమెంటు తయారీలో ఉన్నత నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు మైహోం ఇండస్ట్రీస్ అవార్డు అందుకుంది. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, భారత ప్రభుత్వ హైదరాబాద్ శాఖ తరఫున అందించిన ఈ అవార్డు, ప్రశంసా పత్రాన్ని సంస్థ ప్రతినిధులు అందుకున్నట్లు మేళ్లచెరువు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన మేరకు నాణ్యతా ప్రమాణాలను పాటించడంలో సంస్థ యాజమాన్యం రాజీ పడలేదన్నారు. ఉద్యోగుల సమష్టి కృషితోనే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వగా, ఇండస్ట్రీస్ కమిషనర్ మల్సూర్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (హైదరాబాద్) డైరెక్టర్ పి.వి.శ్రీకాంత్ చేతుల మీదుగా సంస్థ సీనియర్ డీజీఎం విజయ భాస్కర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.



శ్రీకాంత్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న మైహోం సంస్థ ప్రతినిధి విజయ్ భాస్కర్‌రెడ్డి

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మానసిక రుగ్మతతో బాధపడుతున్న విద్యార్థి బలవన్మరణం చెందిన ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన విద్యార్థి(18) భువనగిరిలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గత కొన్ని నెలల నుంచి వోసీడీ అనే మానసిక రుగ్మతతో బాధపడుతూ బీబీనగర్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, శవపంచనామా కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపినట్లు సీఐ సాల్మన్‌రాజు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు తక్షణమే చెల్లించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు మారం నాగేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం వచ్చి 10 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఉపకారవేతనాలు, బోధన రుసుములు విడుదల చేయకపోవడం బాధాకరమని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ల విడుదల జాప్యం కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంగా మారిందని తెలిపారు. మూడు ఏళ్లుగా విడుదల కాని ఆర్‌టీఎఫ్ వల్ల అన్ని కళాశాలలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రైవేటు కళాశాల యాజమాన్యం గత్యంతరం లేక కొట్లలో అప్పులు తెచ్చి అవి తీర్చలేక అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉమ్మడి జిల్లాలో అనేక కళాశాలలు మూత వేసే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. అంతకు ముందు పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి క్లాక్‌టవర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. నాయకులు రామోహన్, నర్సింహ్మారెడ్డి, జానయ్య, సత్యంగౌడ్, ప్రవీణ్, హన్మంతు, వెంకట్‌రెడ్డి, ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నల్గొండలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు, అధ్యాపకులు

చికెన్ ధరలు

ఫారంకోడి	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

మైదానం తోడుగా.. ఉద్యోగ సాధన



నడిగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

★ ఒకే గ్రామంలో 50 మందికి పైగా వ్యాయామ శిక్షకులు

నడిగూడెం, న్యూస్‌టుడే: వ్యాయామ విద్యను అభ్యసించిన 50 మందికి పైగా నడిగూడెం యువకులు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వ్యాయామ శిక్షకులుగా రాణిస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం నడిగూడెంలో దాత కొల్లు పాపయ్య చౌదరి విరాళంతో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండడమే. నిత్యం వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇక్కడ సాధన చేస్తుంటారు. దీనివల్లే ఎక్కువ మంది పోలీస్ కానిస్టేబుల్, వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికవుతున్నారు. ఇటీవల నిర్వహించిన పలు వ్యాయామ ఉద్యోగ నియామకాల్లో నలుగురు ఉద్యోగాలు సాధించారు. గ్రామానికి చెందిన పలువురు వ్యాయామ ఉపాధ్యాయులుగా పలు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు. వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సాధించగా, నేటి యువతకు నిత్యం శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు.

క్రీడలపై మక్కువతోనే..



– పి.ప్రకాశ్, జడ్పీ హెచ్‌ఎస్, చేతవోలు

గ్రామంలో విశాలమైన క్రీడా మైదానం అందుబాటులో ఉండటం, నిత్యం సాధన చేయడంతో పాటు, క్రీడలపై ఉన్న ఆసక్తితో ఉద్యోగం సాధించాను. ఇక్కడ పది, ఇంటర్ పూర్తి చేసిన అనంతరం

యువతకు శిక్షణనిస్తున్నా...



– పి.నాగేశ్వరరావు, జడ్పీ హెచ్‌ఎస్, తుమ్మగూడెం

వ్యాయామ శిక్షణ కోర్సు పూర్తి చేసి తొలి ప్రయత్నంలోనే ప్రభుత్వ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. అందుబాటులో ఉన్న మైదానంలో యువతకు పోలీసు ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాను. వేసవి సెలవులు, దసరా సెలవుల్లో నిర్వహించే ప్రత్యేక క్రీడా పోటీలకు నా వంతు సహకారం అందిస్తున్నా.

నిత్య కృషితోనే...



కె.స్వజన్, మైనార్టీ గురుకుల పాఠశాల, సూర్యాపేట

వ్యాయామ విద్య శిక్షణ పూర్తి చేశాను. పలు ప్రైవేటు, పాఠశాల, కళాశాలల్లో పీఈటీగా విధులు నిర్వహించా. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో నిత్యం కృషి చేస్తూ కలను సాకారం చేసుకున్నాను. నిత్య సాధనతోనే ప్రభుత్వ ఉద్యోగం సాకారమైంది. మైనార్టీ గురుకుల పాఠశాలలో పీఈటీగా ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఎంతో ఆనందంగా ఉంది...



కె.శ్యామల, మైనార్టీ గురుకుల పాఠశాల, కోదాడ

మైనార్టీ గురుకుల పాఠశాలలో పీఈటీ ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సొంతంగా సాధన చేసి తొలి ప్రయత్నంలోనే సాధించాను. నేటి యువత సాధన చేస్తే ఏలాంటి కొలువునైనా ఇట్టే సాధించవచ్చు.

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి



మాట్లాడుతున్న పద్మశాలి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి, చిత్రంలో జాతీయాధ్యక్షుడు స్వామి, తదితరులు

సుభాష్‌నగర్(కరీంనగర్), న్యూస్‌టుడే: రాష్ట్రంలో సామాజిక సంస్థల ఎన్నికలలో ఉమ్మడి జిల్లాలో పద్మశాలీలు రాజకీయ బరిలో ఉండి, సత్తా చాటాలని రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపు నిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలి ట్రస్టు భవనంలో ఈ సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయాధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడప పూర్వంలా జిల్లా శాఖలు ఎన్నికలు నిర్వహించాలన్నారు. కరీంనగర్ మేయర్ పదవి కేటాయించేలా రాజకీయ పార్టీలను కోరాలని తీర్మానం చేశామన్నారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలి సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళంగా ప్రకటించడాన్ని అభినందించారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రం, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆ ప్రతిపాదనకు పదేళ్లు



పునర్నిర్మాణంలో రూపొందిన యాదాద్రి పంచ నారసింహుల దేవాలయం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట స్వయంభూ క్షేత్రాన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలని రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ తలంపునకు గురువారం నాటికి పదేళ్లు నిండనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో కొనసాగిన యాదగిరిగుట్ట క్షేత్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో యాదాద్రిగా పేరు మార్చి ఆరెకరాలలో దేవాలయాన్ని 4.03 ఎకరాలకు విస్తరించి సంప్రదాయంగా కృష్ణశిలతో ఆవిష్కరణ చేశారు. ఆలయంతో పాటు ఇతర వసతులతో క్షేత్రాభివృద్ధి కోసం సుమారు రూ.1200 కోట్ల ఖర్చైనట్లు వైటీడీఏ చెబుతోంది.

★ రాష్ట్ర ప్రధానుల ఉద్యమస్ఫూర్తి దశలోనే 2007లో కేసీఆర్ ఈ క్షేత్ర సందర్శించారు. ఆలయాన్ని విశ్వఖ్యాతి గాంచేలా పునర్నిర్మించాలని తలచారు. నాటి ఆలోచనను సీఎం హోదాలో 2014 అక్టోబరు 17న వెల్లడించారు. కొండకింది పెద్దగుట్ట పై సేకరించిన 850 ఎకరాలలో లేఅవుట్ పనులతో విశాల రహదారులు, హరితమయ ప్రాంగణాలు, కాటేజీల నిర్మాణానికి ప్లాట్ల ఏర్పాటుతో 250 ఎకరాలు రూపుదిద్దుకున్నాయి.

★ కొండ కింద ఉత్తర ముఖంగా సేకరించిన భూముల్లో ఆలయానికి చెందిన వసతులతో ఆధ్యాత్మిక వాడగా రూపొందింది. సమీపాన చిన్న కొండ పై వీవీపీ ల కోసం 14 విల్లాలు, ఒక ప్రెసిడెన్షియల్ సూట్ నిర్మించిన విషయం తెలిసిందే. భక్తుల పుణ్యస్నానాలకు లక్ష్మీపుష్కరిణి నిర్మించారు. కళ్యాణ కట్ట, వ్రత మండపం, అన్న ప్రసాద అందించే సముదాయం, ఆర్టీసీ బస్టాండ్ నిర్మించారు.

★ కొత్తగా కొండపైన భక్తుల నిద్ర చేసేందుకు డార్మిటరీ హాల్, గుండంలో సంకల్ప స్నానం, ప్రసాదాల కొనుగోలు కోసం ప్రత్యేక టికెట్ కౌంటర్లు, సాంస్కృతిక కార్యక్రమాలకు దేవస్థాన నిర్మిస్తోంది.

★ దేవాలయ విమానం స్వర్ణమయం రూపకల్పనకు ఈ మధ్య శ్రీకారం చుట్టారు. 60 కేజీల బంగారంతో స్వర్ణవిమానం రూపకల్పనకు ప్రస్తుత రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో, స్థానిక ఎమ్మెల్యే, విప్ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో యాదాద్రి దేవస్థానం సదరు పనులకు నడుం బిగించిన విషయం తెలిసిందే.

పంటకాలానికి రైతు బంధు రూ.7,500 ఇస్తాం



నల్గొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి తేమ శాతం పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి

◆ ఈ ఏడాది నుంచే పంటల బీమా అమలు: మంత్రి తుమ్మల



హాలియా: సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో మంత్రి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి తదితరులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతుబంధు పంట కాలానికి రూ.7,500 ఇస్తామని.. ఈ ఏడాది నుంచే పంటల బీమాను కూడా అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. బుధవారం నల్గొండలోని ఎన్జీకోసీ మార్కెట్ యార్డులో పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతుల ఏ పంట వేసినా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి పంటల బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

★ గడిచిన 5 ఏళ్లలో బ్యాంకులో రైతు పేరున ఎంత రుణం ఉన్నా.. రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ మేరకు 22 లక్షల తెల్లకార్డులు కలిగిన రైతులకు ఇప్పటికే రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేస్తూ వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. ఈ నెలాఖరు నాటికి తెల్ల కార్డులు లేని 4 లక్షల మంది రైతులకు వారి ఖాతాలో రుణ మాఫీ డబ్బులు జమ చేస్తామన్నారు. రూ.2 లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు కూడా రుణ మాఫీ చేసేందుకు షెడ్యూల్ ప్రకటిస్తామన్నారు. నల్గొండలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

★ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లాలో అత్యధికంగా ధాన్యం పండుతుందన్నారు. రైతులు దాన్యాన్ని ఎంఎస్పీ కేంద్రాలకు తీసుకొస్తే రూ.24 గంటల్లో కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం తర్వాత నల్గొండలోని ఏర్పాటు చేసిన బత్తాయి సాగువుతుందని.. గతంలో ఏర్పాటు చేసిన బత్తాయి మార్కెట్‌లో కోల్డ్‌స్టోరేజీ ఏర్పాటు చేయాలని తుమ్మల దృష్టికి కోమటిరెడ్డి తీసుకెళ్లారు. కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది..

హాలియా: స్థానిక లక్ష్మీనర్సింహ గార్డెన్‌లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.

★ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కాళేశ్వరం లాంటి బోగస్ ప్రాజెక్టు కట్టి రాష్ట్రాన్ని రూ.ఏడు లక్షల కోట్ల అప్పులపాలు చేసిందని విమర్శించారు. రెండేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. మార్కెట్ ఛైర్మన్ పదవి కాదని, అది బాధ్యతని, రైతులకు ప్రభుత్వానికి అనుసంధానంగా ఉంటూ రైతాంగానికి అండగా ఉండాలని వారు తెలిపారు.

★ ముందుగా పట్టణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి భారీ ర్యాలీగా సభా ప్రాంగణానికి వచ్చారు. అనంతరం రైతు వేదిక జిల్లా అధికారి భాయిదేవి నూతన ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, పీసీసీ డెలికేట్ సభ్యుడు కర్నాటి లింగారెడ్డి, మండల అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, హాలియా, నందికొండ పురపాలక ఛైర్మన్లు యడవల్లి అనుపమరెడ్డి, అన్నపూర్ణ, రాష్ట్ర కార్యదర్శి కొండేటి మల్లయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

ఓయూ డాక్టరేట్

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మునుగోడు మండలం గూడపూరుకు చెందిన దర్శనం ప్రవల్లిక ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తెలంగాణలో చేనేత కార్మికుల సామాజిక ఆర్థిక పరిస్థితిపై పరిశోధన చేసినందుకు ఆమెకు ఓయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం డిపార్టుమెంట్ ఆఫ్ ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. కె.బాల రత్నకుమారి ఆమెకు గైడ్‌గా వ్యవహరించింది. ప్రవల్లిక నల్గొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్, మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎకనామిక్స్‌లో పీజీ పూర్తి చేశారు. ప్రవల్లిక ప్రస్తుతం గిరిజన గురుకులం సూర్యాపేటలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

నేడే మాస కల్యాణం..

నార్కట్‌పల్లి గ్రామీణం: గోపలాయపల్లిలోని శ్రీవారిజాల వేణుగోపాల స్వామి గుట్టపైన గురువారం ఉదయం 10.30 నిమిషాలకు శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవారిజాల వేణుగోపాల స్వామి వారి మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని తెలియజేశారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధంకండి: గంగిడి

నాంపల్లి, న్యూస్‌టుడే: అధికార పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేస్తూ స్థానిక ఎన్నికల్లో విజయం సాధించేందుకు భాజపా కార్యకర్తలు సంసిద్ధం కావాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో భాజపా సభ్యత్వ నమోదుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తూ యువత, మహిళలతో సభ్యత్వ నమోదు చేయించాలని సూచించారు. భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎరెడ్ల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దాచెపల్లి నర్సింహ, వెంకట్‌రెడ్డి, గిరిబాబు, శ్రీశైలం, సతీశ్, వెంకటయ్య, కాంతారెడ్డి పాల్గొన్నారు.



నాంపల్లి : సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి

కేతేపల్లి: సమాజంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను భాజపా నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు వివరించాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి కోరారు. కేతేపల్లిలో బుధవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర పథకాలను వివరించడం ద్వారానే పల్లెల్లో భాజపా బలపడుతుందని చెప్పారు. భాజపా మండల అధ్యక్షుడు ఆర్.గోపి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఆపార్టీ జిల్లా నాయకులు అయితగోని అనిత, జి.సాయన్న, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.విజయలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా గ్రంథాలయం



గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులు

నీలగిరి, న్యూస్‌టుడే: అన్ని రకాల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు ప్రశాంత వాతావరణం, ఉదయం నుంచి రాత్రి వరకు చదువుకోవడానికి అన్ని వసతులతో ఉన్న గ్రంథాలయాలు ఉద్యోగ సాధనకు కేంద్రాలుగా మారాయి. అన్ని రకాల ఉద్యోగాలకు అవసరం అయిన పుస్తకాలు అందుబాటులో ఉంచారు. కరెంట్ అఫైర్స్, దినపత్రికలతో పాటు చరిత్ర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అవసరం అయిన పుస్తకాలను అధికారులు కొనుగోలు చేసి అందిస్తున్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుకుని డీఎస్సీలో 29 మంది ఉద్యోగాలు సాధించారు. వీరిలో పది మంది స్కూల్ అసిస్టెంటు, 17 మంది ఎస్జీటీ, ఇద్దరు పీఈటీ ఉద్యోగాలు పొందారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని నిరుద్యోగులు నిత్యం 300 మందికి పైగా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షల కోసం చదువుతున్నారు. సెలవు రోజుతో పాటు రాత్రి 10 గంటల వరకు వారికోసం సిబ్బంది గ్రంథాలయం తెరిచి ఉంచుతున్నారు. విశాలమైన హాలు, మహిళలకు ప్రత్యేక హాలు, పుస్తకాలు ఆన్‌లైన్ సౌకర్యంతో పాటు తాగునీరు ఏర్పాటు చేశారు.

రెండు ఉద్యోగాలు సాధించా.. వినోద్



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు చదువుకుని ఇప్పటికి రెండు ఉద్యోగాలు సాధించా. గురుకులంలో జేఎల్ వచ్చినప్పటికీ.. డీఎస్సీ రాసి స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికయ్యా. జిల్లా స్థాయిలో 10వ ర్యాంకు వచ్చింది. మునుగోడు మండలం పలివెల ఉన్నత పాఠశాలలో ఉద్యోగంలో చేరా. చండూరు మండలం తుమ్మలపల్లి మారుల గ్రామానికి చెందిన నేను నల్గొండలో గది అద్దెకు తీసుకుని నిత్యం గ్రంథాలయంలో చదువుకున్నా.

పట్టుదలతో చదివా: సైదులు



గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివి డీఎస్సీలో ఎస్జీటీ సాధించా. నాలాంటి ఎంతో మంది నిరుద్యోగులకు గ్రంథాలయం ఉపయోగకరంగా ఉంది. వసతుల ఏర్పాటు కూడా బాగుంది.

వారి సహకారం మర్చిపోలేను: జ్యోతి



తాను ఉద్యోగం సాధించడానికి జిల్లా గ్రంథాలయంలో కల్పించిన వసతులే కారణం. వారి సహకారం మర్చిపోలేను. డీఎస్సీ తెలుగు పండిట్ 7వ ర్యాంకు సొంతం చేసుకున్నా. సూర్యాపేట మండలం టేకుమట్ల సమీపంలోని రత్నాపూర్ పాఠశాలలో చేరాను. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రంథాలయంలోనే ఉంటూ చదువుకున్నా. అవసరమైన పుస్తకాలు అడిగిన వెంటనే కొనుగోలు చేసి సమకూర్చేవారు. ప్రశాంత వాతావరణం కల్పించి నిరుద్యోగులకు అండగా నిలిచారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకం

నల్గొండ లీగల్, న్యూస్‌టుడే: కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు అందుబాటులో ఉండాలని జిల్లా కోర్టు న్యాయవాదుల బార్ అధ్యక్షుడు సిరిగిర వెంకట్‌రెడ్డి అన్నారు. న్యాయవాది కెవి. రమణారావు మొదటి అదనపు జిల్లా న్యాయస్థాన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సందర్భంగా బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రమణారావ్‌ను న్యాయవాదులు సన్మానించారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి లింగయ్య, సీనియర్ జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన రమణారావుని సన్మానిస్తున్న బార్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తదితరులు

మురుగులో కుళాయి..



నకిరేకల్ పురపాలిక పరిధిలోని 16వ వార్డులో కొండ నాగులు మిల్లు సమీపంలో ప్రజా కుళాయి మురుగు మధ్యలో ఉంది. మురుగు దాటుకుంటూ వెళ్లి నిత్యం తాగునీరు పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఈ కుళాయి చుట్టూ ప్లాట్‌ఫాం నిర్మించాలని, ఇక్కడ మురుగు నీరు నిల్వ ఉండకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు పురపాలిక అధికారులను కోరుతున్నారు.

నకిరేకల్, న్యూస్‌టుడే:

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

చండూరు, న్యూస్‌టుడే: చండూరు గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సైదులు కొంతమందికి తప్పుడు ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేసి ప్రభుత్వ భూముల కబ్జాకు సహకరించారని రైతు సేవా సహకార సంఘం సభ్యులు కట్ట భిక్షం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి సైదులుని సస్పెండ్ చేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని భిక్షం మరోసారి ఫిర్యాదు చేయగా.. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశానుసారం డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేపట్టారు. వారి నుంచి రాతపూర్వకంగా వాంగ్మూలాన్ని తీసుకున్నామని.. విచారణలో తేలిన విషయాలను జిల్లా ఉన్నతస్థాయి అధికారులకు అందజేస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.



పంచాయతీ కార్యదర్శిపై విచారణ చేపడుతున్న డివిజన్ పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు

రూ.1.65 లక్షల విలువైన పుస్తకాల పంపిణీ

నల్గొండ జిల్లా పరిషత్తు, నీలగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ, జడ్పీ స్టడీ సర్కిల్‌లో పోటీ పరీక్షల కోసం చదువుతున్న విద్యార్థుల కోరిక మేరకు కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.65లక్షల విలువైన పుస్తకాలను బుధవారం మంత్రి కోమటిరెడ్డి సంబంధిత అధికారులకు అందచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ గోనారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలు అందచేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

పేద కుటుంబాలకు కాంగ్రెస్ అండ

మునుగోడు, న్యూస్‌టుడే: పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు బీమనపల్లి సైదులు, యువజన కాంగ్రెస్ మాజీ జిల్లా అధ్యక్షులు పాల్వాయి జితేందర్‌రెడ్డి అన్నారు. మునుగోడు మండల కేంద్రంలోని ఎమ్మెల్యే వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. పట్టణ అధ్యక్షులు సాగర్ల లింగస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు పందుల భాస్కర్, వెంకన్న, గిరిధర్ పాల్గొన్నారు.



మునుగోడు క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గట్టుప్పల: ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను శేరిగూడెం గ్రామానికి చెందిన కావలి శంకరయ్యకు రూ.60వేలు, అంతంపేట గ్రామానికి చెందిన గూడపు రవికి రూ.30వేలను బుధవారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. జగన్నాథం, ఐలయ్య, శేఖర్, మోతీలాల్, సురేష్, నారాయణ, చంద్రయ్య పాల్గొన్నారు.

మోడు బారింది.. ప్రమాదం కానుంది

మండల కేంద్రం నుంచి పాత బస్టాండ్‌కి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఓ చెట్టు మోడు బారి ప్రమాదకరంగా మారింది. ఆ దారిలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రజలు అది ఎప్పుడు కూలి ఎవరిపైన పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చెట్టును తొలగించాల్సిందిగా గ్రామస్థులు వేడుకుంటున్నారు. ఇదే విషయమై పంచాయతీ కార్యదర్శి యూసఫ్ వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మర్రిగూడ



అన్నమయ్య సంకీర్తన గాన కచేరి

నల్గొండ కల్చరల్, న్యూస్‌టుడే: అన్నమయ్య సంకీర్తన గాన కచేరి కార్యక్రమం బుధవారం రాత్రి స్థానిక రామాలయంలో ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్య సంకీర్తనా ప్రచార సమితి ఆధ్వర్యంలో ప్రతి మాసం నిర్వహించిన గాన కచేరి కార్యక్రమంలో రాపోలు రమణమ్మ అన్నమయ్య కీర్తనలు పాడారు. వాయిద్య సహకారం కీబోర్డు లక్ష్మీ నారాయణరావు, తబల జయప్రకాశ్, రిథమ్స్ భిక్షం అందజేశారు. డాక్టర్ పురుషోత్తమాచార్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న రాపోలు రమణమ్మ

పండగ సెలవుల్లో పాఠశాలలు ధ్వంసం

నాంపల్లి, న్యూస్‌టుడే: చదువు నేర్పిన సరస్వతీ నిలయాలను ఆకతాయిలు, మందుబాబులు వదలడం లేదు. దసరా సందర్భంగా పక్షం రోజులుగా పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ సెలవుల కాలంలో మండలకేంద్రం, గ్రామాల్లోని పాఠశాలలను ఆకతాయిలు ఆటవిడుపుగా మార్చుకున్నారు. రాత్రి వేళల్లో మద్యం తాగడం, పరికరాలు, ఫర్నీచర్ ధ్వంసం చేయడం వంటి పనులకు పాల్పడ్డారు. మంగళవారం పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా నాంపల్లి, తుంగపహాడ్ పాఠశాలల్లో ఆకతాయిల దుశ్చేష్టలు బయటపడ్డాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు నిఘా నేత్రాలను ధ్వంసం చేసి, ఓ కెమెరాను తీసుకెళ్లారు. విద్యార్థులకు తాగునీరందించే కుళాయిలను విరగ్గొట్టారు. తుంగపహాడ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి గదిలో ధూమపానం, మద్యం తాగి, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఈ ఘటనలపై ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



నాంపల్లి: జడ్పీ పాఠశాలలో సీసీ కెమెరా ఎత్తుకెళ్లిన ఆకతాయిలు

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

నకిరేకల్, న్యూస్‌టుడే: మండలంలోని తాటికల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను బుధవారం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వేముల వీరేశం, నకిరేకల్ పుర ఛైర్‌పర్సన్ చౌగోని రజిత, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైద రవీందర్, అధికార ప్రతినిధి చెనగాని దయాకర్, స్థల దాత ముచ్చపోతుల జానయ్య, ఆలయ కమిటీ ప్రతినిధి బంటు రవి తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్: విగ్రహప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే వేముల వీరేశం, పుర ఛైర్‌పర్సన్ రజిత

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మర్రిగూడ, న్యూస్‌టుడే: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలు అయ్యాయి. మండలంలోని రాజపేట తండా గ్రామశివారులో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివన్నగూడెం గ్రామానికి చెందిన గొట్టి కుమారస్వామి, జంగిలి జగన్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. బుధవారం పాఠశాలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో మర్రిగూడ నుంచి పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో తండా సమీపానికి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న విద్యార్థులకు, ఆటోలో ఉన్న మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారస్వామికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించారు.

విద్యుత్తు తీగల చోరీ

కనగల్, న్యూస్‌టుడే: కనగల్ వాగు వెంట గల వ్యవసాయ బోరు మోటార్లకు సంబంధించిన సర్వీసు వైర్లు, ఫ్యూజులను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీ చేశారు. వ్యవసాయ బావుల వద్ద సర్వీసు వైర్లను కత్తిరించి సమీపంలో కాల్చి అల్యూమినియం, రాగి తీగలను తీసుకెళ్లారని బాధిత రైతులు తెలిపారు. 25 మంది రైతులకు సంబంధించి వైర్లను ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

అత్యాచారానికి పాల్పడ్డ ఆటోడ్రైవర్ అరెస్టు

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: అర్ధరాత్రి ప్రయాణికురాలిపై అత్యాచారానికి పాల్పడిన ఆటోడ్రైవర్‌ను గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 15న తెల్లవారుజామున 2.15 గంటలకు గచ్చిబౌలి వెళ్లేందుకు పటాన్‌చెరు నియోజకవర్గం రామచంద్రాపురం వద్ద ఆటో ఎక్కిన ఓ యువతి(32)పై మార్గమధ్యలో మసీద్‌బండ కమాన్ వద్దకు రాగానే ఆటోడ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న ర్యాపిడో డ్రైవర్ ఆటో దగ్గరికి వెళ్లడంతో యువతిని కిందకు తోసేసి ఆటోడ్రైవర్ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు అత్యాచారానికి పాల్పడింది జంగం ప్రవీణ్(24)గా గుర్తించారు. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామానికి చెందిన ఇతను కొంతకాలం క్రితం శేరిలింగంపల్లి ప్రాంతానికి వలసవచ్చాడు. గోపీనగర్‌లో ఉంటూ ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అర్ధరాత్రి తన ఆటో ఎక్కిన యువతిపై అఘాయిత్యానికి పాల్పడి పారిపోయాడు. సీసీకెమెరాల దృశ్యాల ఆధారంగా ఆటోను గుర్తించిన పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి నిందితుడు ప్రవీణ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆల్విన్‌కాలనీ వద్ద రోడ్డు పక్కనే తన తల్లి నిర్వహిస్తున్న మీల్స్ బండి వద్ద ఉన్న ప్రవీణ్‌ను పోలీసులు అరెస్టు చేసి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడికి వైద్యపరీక్షలు నిర్వహించి రిమాండ్‌కు తరలించారు. బాధితురాలు చెన్నై నుంచి వచ్చానని, నానక్‌రాంగూడలో ఉంటున్నట్లు, ఆర్కిటెక్ట్‌గా పనిచేస్తున్నట్లు చెప్పిన వివరాల్లోనూ నిజం లేదని పోలీసులు తెలిపారు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆమెకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **నటరాజ్:** దేవర, **తిరుమల:** వేట్టయన్, **వెంకటేశ్వర:** మార్టిన్, **పీవీఎన్:** మా నాన్న సూపర్ హీరో
నకిరేకల్: **రామకృష్ణ**- వేట్టయన్, **వెంకటేశ్వర**- దేవర

యాదిరెడ్డి సేవలు మరువలేనివి

మర్రిగూడ, న్యూస్‌టుడే: దివంగత నేత, సీపీఐ నాయకుడు యాదిరెడ్డి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం తిరుగండ్లపల్లిలో జరిగిన యాదిరెడ్డి దశదిన కర్మలో జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావుతో కలిసి పాల్గొన్నారు. భిక్షంరెడ్డి, పాండురంగారావు, శేఖర్, యాదిరెడ్డి, వెంకట్రామ్, భూపతిరెడ్డి, లక్ష్మయ్య, నర్సింహ, హరికృష్ణ పాల్గొన్నారు.

మునుగోడు: విద్యార్థులకు జరుగుతున్న అన్యాయాలపై శివ చేసిన ఉద్యమాలు మరువలేనిదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండ శ్రీశైలంలు అన్నారు. మండల కేంద్రానికి చెందిన యసరాని శివ ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకోవడం బాధకరమన్నారు. మాజీ సర్పంచి మిర్యాల వెంకన్న, మండల కార్యదర్శి మిర్యాల భరత్, ధనంజయ, లింగస్వామి, లింగస్వామి ఉన్నారు.

రైతులకు అన్యాయం జరిగితే కేంద్రాలను రద్దు చేస్తాం

శాలిగౌరారం, న్యూస్‌టుడే: రైతుల పండించిన పంటకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర అందిస్తుందని, కేంద్రాలు నిర్వహించే మహిళా సంఘాలు, హమాలీలు అధికారులకు, రైతులకు సహకరిస్తూ, రైతులు తెచ్చిన ధాన్యాన్ని వరుసక్రమంలో కొనుగోలు చేయాలని, రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదు వచ్చినా ఆ కేంద్రాన్ని రద్దు చేస్తామని డీఆర్‌డీవో పీడీ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండలంలోని భైరవునిబండ, ఎన్జీ కొత్తపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. డీపీఎం మోహన్‌రెడ్డి, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, ఏపీఎం జానకి, మార్కెటింగ్ ఎస్పార్పీ శాంత, ఏవో సౌమ్య శృతి, ఏపీవో జంగమ్మ, ఈసీ వెంకటాచారి, సైదులు పాల్గొన్నారు



భైరవునిబండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి, అధికారులు

నల్గొండ గ్రామీణం: రైతులు ధాన్యం విషయంలో దళారులను ఆశ్రయించ వద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని నల్గొండ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఓజ్జ సత్యనారాయణ అన్నారు. నల్గొండ మండలం అనంతారంలో బుధవారం హాకా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇందులో హాకా మేనేజర్ కోటయ్య, నాయకులు ఏళ్ల రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. బుధవారం మండల పరిధిలోని శివన్నగూడెం, కుదబక్షుపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో అమ్మి మద్దతు ధరను పొందాలని తెలిపారు. మండల వ్యవసాయాధికారి హేమలత, నర్సింహా, మధు, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి ఉన్నారు.

నల్లా నీరు వృథా..

నల్గొండ మండలం దండెంపల్లి పాఠశాల సమీపంలోని మిషన్‌భగీరథ ట్యాంక్ నుంచి నల్లా నీరు లీకవుతుంది. దీంతో స్థానికులకు నీటి కొరత ఏర్పడుతుంది. నల్లా నీటి వృథాను అరికట్టి గ్రామస్థులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వెంకటరెడ్డిని వివరణ కోరగా మరమ్మతులు చేసి నీటి వృథాను అరికడతామన్నారు.

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:



విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు



నకిరేకల్: నూతన ఉపాధ్యాయులు

మర్రిగూడ, న్యూస్‌టుడే: ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులు మండల విద్యాధికారి బిట్టు శ్రీనివాస్ చేతులమీదుగా బుధవారం నియామక పత్రాలను అందుకొని మండలంలోని వివిధ పాఠశాలల్లో విధుల్లో చేరారు. హేమలత, కరీం, బాలరాజు, సైదులు, శ్రీనివాస్, పాల్వాయి వెంకట్‌రెడ్డి, అశోక్, భవ్యశ్రీ, నాగేంద్ర, ప్రియాంక, జగదీష్, విగ్నేశ్వర్ పాల్గొన్నారు.

నకిరేకల్: డీఎస్సీ-24 ద్వారా నియమితులైన నూతన ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. నకిరేకల్ మండలానికి కేటాయించిన 12 మంది ఉపాధ్యాయుల స్థానిక ఎమ్మార్సీలో రిపోర్టు చేశారని ఎంఈవో ఎం.నాగయ్య తెలిపారు. నకిరేకల్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు, చీమలగడ్డ, గొల్లగూడెం పీఎస్‌లలో ఒక్కరు, మర్రూరు, గోరెంకలపల్లి, చందంపల్లి యూపీఎస్‌లలో ఇద్దరు చొప్పున కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. నకిరేకల్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఒక పీడీ విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులను ఎంఈవో ఎం.నాగయ్య, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు టి.నర్సింహమూర్తి, ప్రతినిధి కె.శ్రీనివాస్ అభినందించారు. ఐడీ కార్డుల దరఖాస్తు ఫారాలను టీఎస్‌యూటీఎఫ్ ప్రతనిధులు వారికి అందజేశారు.

కనగల్: కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు పోస్టింగ్‌లు ఇవ్వడంతో మండలానికి 11 మంది కొత్తవారు రాగా వారు బుధవారం ఆయా పాఠశాల్లో చేరారు. చిన్నమాదారం ప్రాథమిక పాఠశాలలో ఎన్.మహేశ్, మైలారం జి.స్వరాజ్యం, శేరిలింగోటం ప్రవీణ్‌కుమార్, తంగెళ్లవారిగూడెం బ్రహ్మయ్య, చర్లగౌరారం సాయికుమార్, పొనుగోడు ఉమ, పర్వతగిరి స్వప్న, తెలకంటిగూడెం సలీం పాష్, పగిడిమర్రి అరుణ, కనగల్ ఉన్నత పాఠశాల స్వాతిలు విధులో చేరినట్లు తెలిపారు.

చిట్యాల గ్రామీణం: ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికయిన పదిహేను మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. విధుల్లో చేరిన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ఎంఈవో సైదానాయక్ పరిశీలించి, అనంతరం వారికి కేటాయించిన పాఠశాలకు సంబంధించిన ఉత్తర్వులను ఆయన అందజేశారు. చిట్యాల పీఎస్‌లో సతీష్, పెద్దకాపర్తి పీఎస్‌లో భవాని, మంజుల, బోయగుబ్బ పీఎస్‌లో గోపగోని శ్రీనివాసులు, చిన్నకాపర్తి పీఎస్‌లో సింధూ, ఆరెగూడెం పీఎస్‌లో ఉజ్వల, వెలిమినేడు పీఎస్‌లో అనూష, ఉరుమడ్ల పీఎస్‌లో శిరీష, వట్టిమర్తి పీఎస్‌లో సరిత, మౌనిక, తాళ్లవెల్లంల పీఎస్‌లో మౌనిక. శివనేనిగూడెం పీఎస్‌లో ఉపేందర్, వెలిమినేడు జడ్పీహెచ్‌ఎస్‌లో శంకర్, ఏపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో లీలావతి, చిట్యాల జడ్పీహెచ్‌ఎస్‌లో సౌమ్య విధుల్లో చేరారు.



మండల విద్యాధికారి చేతులమీదుగా నియామకపత్రాలు అందుకుంటున్న నూతన ఉపాధ్యాయులు

తిప్పర్తి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ఇటీవల నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం విధుల్లో చేరారు. తిప్పర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం ఎస్‌ఏ, తిప్పర్తి బాలికల ఉన్నత పాఠశాలలో పీడీ, రామలింగాలగూడలోని పీఎస్‌లో ఇద్దరు ఎస్జీటీలు, తిప్పలమ్మగూడ, మర్రిగూడ, యాపలగూడ, ఎల్లమ్మగూడ, ఆరెగూడ గ్రామాల్లోని పీఎస్‌ల్లో ఒక్కరు చొప్పున ఎస్జీటీలు, గోదావరిగూడ, అనిశెట్టిదుప్పలపల్లి గ్రామాల్లోని పీఎస్‌ల్లో ఒక్కరు చొప్పున ఎస్జీటీ ఉపాధ్యాయులు విధుల్లో చేరారు.

అవీ ఇవీ

పాఠశాలకు స్నేహ హస్తం.. నీలగిరి: లయన్స్ క్లబ్ స్నేహ ఆధ్వర్యంలో బుధవారం నిడమనూరు మండలం యాచారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన బెంచీలు, బ్లాక్ బోర్డులు, క్రీడా సామగ్రిని అందజేశారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని క్లబ్ సభ్యులు తెలిపారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ యారాల ప్రభాకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ స్నేహ అధ్యక్షురాలు యాస సరళ, శివశంకర్ సింహాద్రి, రేపాల మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ.. కేతేపల్లి: కేతేపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముదిరెడ్డి వీరారెడ్డి మృతదేహంపై బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్‌రెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ బోళ్ల వెంకటరెడ్డి, టీపీసీసీ పూర్వ కార్యదర్శి దైదా రవీందర్, పీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నివాళి.. చిట్యాల, న్యూస్‌టుడే: సీపీఎం కేంద్రకమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు సోదరి గంజి రంగమ్మ(81) బుధవారం గుండెపోటుతో చిట్యాలలో మృతిచెందారు. మృతదేహాన్ని ఆ పార్టీ నల్గొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎండీ జహంగీర్ సందర్శించి నివాళి అర్పించారు. సీతారాములుతోపాటు వారికుటుంబ సభ్యులను పరామర్శించారు. పురఛైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, బొజ్జ చిన్నవెంకులు, జిట్ట సరోజ, మండల కార్యదర్శి అరూరి శ్రీను, భక్తమార్కండేయ పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు గంజి వెంకటేశం, మిర్యాల ప్రకాశ్, కుకుడాల గోవర్ధన్, నారబోయిన శ్రీనివాస్, జెల్ల సత్తయ్య, మనోహర్ తదితరులు నివాళి అర్పించారు.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

మహిళలకు రక్షణ కల్పించాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, దౌర్జన్యాలను నివారించడం కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, మహిళా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు నిమ్మల పద్మ అన్నారు. బుధవారం దేవరకొండ సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఐద్వా మహిళా సంఘం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చినా వాటిని అమలు చేసే విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. తోట రమణ, అనిత, పాతనబోయిన జ్యోతి, అలివేలు, ధనలక్ష్మి, సైదమ్మ, రేణుక, అంజమ్మ తదితరులున్నారు.

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే:

? నందికొండ మున్సిపల్ పరిధిలోని విజయవిహార్ నుంచి కెనాల్స్‌కు వస్తున్న రోడ్డు వెంట కంపచెట్లు పెరిగి ఇబ్బందికరంగా మారింది. – బాలాజీ, హిల్‌కాలనీ

✔ కంపచెట్లను తొలగించడానికి చర్యలు తీసుకుంటాం. – శ్రీను, మున్సిపల్ కమిషనర్, నందికొండ

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని చైతన్యనగర్‌లో ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు భారీగా మొలచి.. వ్యర్థాలు పేరుకుపోతూ ఇబ్బందులు పడుతున్నాం. – నాగేందర్, మిర్యాలగూడ

✔ ఖాళీ స్థలాల్లో మొక్కలు, వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. – ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

దాడులను సహించబోం: బీఎల్ఆర్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులపై దాడులను సహించబోమని ఎమ్మెల్యే బీఎల్ఆర్ అన్నారు. దామరచర్ల మండలానికి చెందిన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌పై భారాస నాయకులు రాళ్లతో దాడి చేసి గాయపరచగా.. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్ హరిప్రసాద్‌ను పరామర్శించి.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా అందించారు.



మిర్యాలగూడలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం: గోలి సైదులు

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతోనే మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా ఛైర్మన్ గోలి సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశాన్ని నిర్వహించారు. భవిష్యత్తులో రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. నల్లవెల్లి సంజీవ, బోగారి విజయకుమార్, రేఖల సైదులు, యాదగిరి, కృష్ణయ్య పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక.. చింతపల్లి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కో-కన్వీనర్లుగా గంటల ఆంజనేయులు, నల్లవెల్లి సైదులు, నాగటి వెంకటేష్, నిమ్మ వీరయ్య, సురేష్, సురేష్‌తో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** విశ్వం, **శ్రీనివాస:** వేట్టయన్

విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, జనక అయితే గనక, మార్టిన్

పీహెచ్‌సీలోనే రోగ నిర్ధారణ పరీక్షలు

❖ డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి

ముఖాముఖి



దేవరకొండ, న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులైన డెంగీ, విషజ్వరాలు, టైఫాయిడ్ ఇతర రోగ నిర్ధారణ పరీక్షల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి రూ.వేలు ఖర్చు చేసుకోవద్దని, అన్ని రోగ నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వాసుపత్రిలోనే అందుబాటులో ఉన్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సౌకర్యాలు, సిబ్బంది, మందుల కొరతపై 'న్యూస్‌టుడే' నిర్వహించిన ముఖాముఖిలో పలు వివరాలు వెల్లడించారు.

న్యూస్‌టుడే: దేవరకొండ నియోజకవర్గంలో 24 గంటలు పనిచేసే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వివరాలు తెలపండి?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: దేవరకొండ నియోజకవర్గంలో ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో చింతపల్లి, మాల్, కొండమల్లేపల్లి, చందంపేట, డిండి, బొద్దుపల్లి, గుడిపల్లి, పీఏపల్లి ఉన్నాయి. వీటి పరిధిలో ఉప ఆరోగ్య కేంద్రాలు 80 ఉన్నాయి.

న్యూస్‌టుడే: రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయా?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: నియోజకవర్గంలోని ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రోగ నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ప్రైవేట్‌కు వెళ్లి డబ్బులు ఖర్చు చేయాల్సిన పని లేదు. చికెన్‌గన్యా, మలేరియా, డెంగీ వంటి రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయా? మందుల కొరత ఏమైనా ఉందా?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: దేవరకొండ నియోజకవర్గ పరిధిలో 24గంటలు వైద్యసేవలు అందించే చందంపేట, డిండి, చింతపల్లి, పీఏపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ కాన్పులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 24 గంటలు నర్సులు అందుబాటులో ఉంటారు. మందుల కొరత లేదు. కుక్కకాటు, పాముకాటు, ఇతర జంతువులకు సంబంధించిన వ్యాక్సిన్లు పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి.

న్యూస్‌టుడే: సీజనల్ వ్యాధులు ఎలా ఉన్నాయి?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: సీజనల్ వ్యాధులు తగ్గుముఖం పడుతున్నట్లు తెలుస్తుంది. ఎలాంటి వ్యాధి లక్షణాలు కన్పించినా వెంటనే ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

న్యూస్‌టుడే: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉన్నట్లు తెలుస్తుంది?

డిప్యూటీ డీఎంహెచ్‌వో: అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు. చింతపల్లి, చందంపేట మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ముగ్గురు చొప్పున స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండాల్సి ఉండగా ఒకరు మాత్రమే ఉన్నారు. స్టాఫ్‌నర్సుల కొరత వేధిస్తుంది. త్వరలోనే భర్తీ అవుతారు.

మారుమూల తండా నుంచి ఇన్‌ఛార్జి ఉపకులపతి స్థాయికి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ మండల పరిధిలోని బల్లునాయక్ తండాకు చెందిన గిరిజన మహిళా ప్రొఫెసర్ సూర్య ధనుంజయ నాయక్ హైదరాబాద్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న చాకలి ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఇన్‌ఛార్జి ఉప కులపతిగా నియమితులయ్యారు. తండాకు చెందిన బల్లునాయక్-ద్వాలీ బాయి దంపతులకు జన్మించిన 11 మందిలో తొమ్మిదో సంతానంగా ఆమె జన్మించారు. మారుమూల తండాలో జన్మించిన ఆమె నిత్యం ఐదు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్తూ.. ప్రాథమిక విద్య పూర్తి చేశారు. పదో తరగతి పూర్తి కాగానే ఉస్మానియా విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ ధనుంజయ నాయక్‌తో వివాహం జరిగింది. వివాహం తర్వాత ఇంటర్, డిగ్రీ అనంతరం ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పీజీ పూర్తి చేసి.. అదే విశ్వ విద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధిపతిగా పని చేస్తున్నారు.



సూర్య ధనుంజయ నాయక్

హర్షం.. మిర్యాలగూడ: హైదరాబాద్‌లో ఏర్పాటైన చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి ఇన్‌ఛార్జి ఉపకులపతిగా మిర్యాలగూడ ప్రాంతానికి చెందిన సూర్య ధనుంజయ నియామకం హర్షణీయని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దశరథనాయక్ ఒక ప్రకటనలో అన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే



చింతపల్లిలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

చింతపల్లి, న్యూస్‌టుడే: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ శివసాయి జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రుణమాఫీ జరగని రైతులు అధైర్యపడొద్దన్నారు. కాంగ్రెస్‌ను విమర్శించే స్థాయి భారాస నాయకులకు లేదని అన్నారు. మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అలివేలు, నాగభూషణం, సంజీవ రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ వెంకటయ్య, యాదగిరి, పవన్, వెంకటయ్యగౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ నియోజకవర్గంలోని పెండింగ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని జలసౌధలో ఏర్పాటు చేసిన దేవరకొండ నియోజకవర్గ పెండింగ్ లిఫ్ట్ ఇరిగేషన్ సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నేరెడుగొమ్ము మండలంలో గాజుబేడం లిఫ్ట్, రామనోనిబండ లిఫ్ట్, చందంపేట మండలంలోని చిత్రియాల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు సర్వే పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. గుడిపల్లి మండలం చిలకమర్రి గ్రామపంచాయతీ నీలంనగర్ స్టేజీవద్ద తిరుమల జిన్నింగ్ రైస్‌మిల్లులో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దేవరకొండ ఏఎంసీ ఛైర్మన్ జమున, ఏఎంసీ డైరెక్టర్లు, పీఏసీఎస్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, తిలక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లు పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలి: ఐద్వా

మిర్యాలగూడ పట్టణం: మహిళా రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోలెబోయిన వరలక్ష్మి, పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. బుధవారం మిర్యాలగూడలో నిర్వహించిన ఐద్వా మహాసభల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం పట్టణ, మండల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. ఒకటో పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా కౌసల్య, అరుణ, రెండో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా ఊర్మిళ, గోవర్ధన, మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మంగ, సైదమ్మలను ఎన్నుకున్నారు. పద్మ, మాధవి, నాగమణి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ వైపు మొగ్గుచూపండి: మంత్రి

నిడమనూరు, న్యూస్‌టుడే: రైతులు వరితో పాటు ఆయిల్‌పామ్ పంటవైపు మొగ్గు చూపాలని.. రాష్ట్ర ప్రభుత్వం ఆ పంటకు ఎకరాకు రూ.10వేలు రాయితీ అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారాన్ని స్థానిక బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తుమ్మలతో పాటు రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎల్పీ మాజీనేత కుందూరు జానారెడ్డితో పాటు ఎంపీ రఘువీర్‌రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అధక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ దీపావళి లోపు రూ.రెండు లక్షల లోపు రుణాలు ఉండి తెల్లరేషన్‌కార్డు ఇతర కారణాలతో మాఫీ కాని మరో నాలుగు లక్షల మందికి కూడా మాఫీ నగదు జమచేస్తామన్నారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు ఆర్అండ్‌బీ శాఖ నుంచి రూ.516 కోట్లు కేటాయించామన్నారు. జానారెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే బీఎల్ఆర్‌లు ప్రభుత్వ పథకాలపై మాట్లాడారు. అంతకంటే ముందు నూతనంగా మార్కెట్ ఛైర్మన్‌గా అంకతి సత్యనారాయణ, వైస్ ఛైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పాలకవర్గంలోని మిగిలిన సభ్యులతో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిణి ఛాయదేవి ప్రమాణస్వీకారం చేయించారు. కలెక్టర్ నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ అమిత్, హౌజింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, రంగశాయిరెడ్డి, వల్లభ్‌రెడ్డి, మల్లయ్య, శ్రీను పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెద్దవూర: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమం, గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి పాటుపడుతుందని ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. పెద్దవూర మండలంలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీ కాని వారు ఎవరూ అధైర్యపడొద్దని రుణమాఫీ అయ్యే విధంగా ముఖ్యమంత్రితో చర్చించి రుణమాఫీ కాని వారికి కూడా త్వరలో వచ్చేలా కృషిచేస్తామన్నారు. దసరా కానుకగా రైతులు పండించే వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చినట్లు గుర్తుచేశారు. రూ.11కోట్లతో పెద్దగూడెం స్టేజీ నుంచి అన్నారం స్టేజి వరకు 15 కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి, రూ.25కోట్ల వ్యయంతో ముసలమ్మచెట్టు నుంచి వెల్మగూడెం, చేపూరు, గుర్రంపోడు వరకు 11 కిలోమీటర్ల మేర రెండు లైన్ల రహదారి, గ్రామాల్లో సీసీ రహదారులకు గాను రూ.25కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, కర్నాటి లింగారెడ్డి, అబ్బిడి కృష్ణారెడ్డి, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ తదితరులున్నారు.



పెద్దవూర మండలం పెద్దగూడెం స్టేజీ వద్ద రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు

నీటి నాణ్యతను పరిశీలించాలి: డీఈ వెంకట్‌రెడ్డి

వేములపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని రైతువేదికలో మిషన్ భగీరథ ఆధ్వర్యంలో వేములపల్లి, మాడ్గులపల్లి గ్రామ మంచి నీటి సహాయకులకు బుధవారం శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నీటి నమూనా సేకరించి ప్రయోగశాలకు పంపించి నీటి నాణ్యతను పరిశీలించి, ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ శిక్షణ తరగతుల ద్వారా గ్రామాల్లో మంచినీటి సరఫరాలో పైపులైన్ల లీకేజీ మరమ్మతులు, సింగిల్ ఫేజ్, త్రీఫేజ్, మోటర్ల రిపేర్, చేతిపంపుల రిపేర్, నీటి నాణ్యత తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నందున వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ నీటి సహాయకులకు, మిషన్ భగీరథ సిబ్బందికి సూచించారు. వేములపల్లి ఎంపీడీవో శారదాదేవి, మాడ్గులపల్లి ఎంపీడీవో సంగీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు గంగాభవాని, దినేష్, నీటి నాణ్యత శిక్షకులు వీరారెడ్డి, క్రాంతికుమార్, బ్రహ్మాచారి, గ్రామ మంచి నీటి సహాయకులు, మిషన్ భగీరథ సహాయకులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకట్‌రెడ్డి

రాష్ట్రంలో భారాస కనుమరుగు: భాజపా

చింతపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భారాస కనుమరుగు అవుతుందని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పతనం ఖాయమని భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌పై వ్యతిరేకత వచ్చిందన్నారు. క్రియాశీల కార్యకర్త ఇంటింటికి వెళ్లి 100 మందితో సభ్యత్వాలు చేయించాలని అన్నారు. అనంతరం పలువురు కాషాయ తీర్థం పుచ్చుకోవడంతో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, లాలునాయక్, మండల అధ్యక్షుడు శివర్ల రమేష్, కాసోజు బ్రహ్మాచారి, నగేష్, శేఖర్, గొడ్డటి మధు, మహేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

స్వచ్ఛ మిర్యాలగూడే ధ్యేయం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛ మిర్యాలగూడే ధ్యేయంగా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు పుర అధ్యక్షుడు తిరునగరు భార్గవ్ అన్నారు. బుధవారం స్థానిక పుర కార్యాలయంలో వ్యర్థాలను సేకరించే తోపుడు బండ్లను కమిషనర్ ఎండీ యూసుఫ్‌తో కలిసి సిబ్బందికి పంపిణీ చేసి మాట్లాడారు. స్వచ్ఛతలో మిర్యాలగూడను మెరుగైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సిబ్బంది, ప్రజలు సహకరించాలని కోరారు. మాజీ పుర అధ్యక్షురాలు నాగలక్ష్మి, అమృతం సత్యం, చంద్రకళ, కుర్ర చైతన్య, సాధినేని స్రవంతి, సలీం, మలగం రమేష్, తలకోల సుజాత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

టార్పాలిన్లను సద్వినియోగం చేసుకోవాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే టార్పాలిన్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మాల్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొంతం అలివేలు అన్నారు. బుధవారం మాల్ మార్కెట్‌లో టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్, కాంటాలను అందించారు. వైస్ ఛైర్మన్ నక్క శ్రీను, కార్యదర్శి వేణుగోపాల్, సింగిల్ విండో ఛైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, సంజీవరెడ్డితో పాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలను విడుదల చేయాలి

దేవరకొండ, న్యూస్‌టుడే: మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ, కొండమల్లేపల్లి ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల యాజమాన్యం చేస్తున్న బంద్‌కు మద్దతు తెలిపి దేవరకొండ పట్టణంలోని కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.



దేవరకొండ: కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు

ఉపాధ్యాయుల నియామకంలో విచిత్రం

చింతపల్లి: మండలంలోని వివిధ పాఠశాలలకు బుధవారం నూతనంగా వచ్చిన ఉపాధ్యాయుల నియామకాల్లో విచిత్రం చోటు చేసుకుంది. విద్యార్థులు ఉన్న, కొరత ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులు రాలేదు. విద్యార్థులు లేని పాఠశాలలకు కేటాయించారు. మండలంలోని రోటిగడ్డతండాలోని పాఠశాలలో ఒక విద్యార్థి ఉండగా ఒకరు విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు నూతనంగా మరో ఉపాధ్యాయురాలిని నియమించారు. కుర్మపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో 40మంది విద్యార్థులు ఉండగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అదనంగా మరో ఉపాధ్యాయురాలిని కేటాయించారు. పోలేపల్లి రాంనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో 112 మంది విద్యార్థులు ఉండగా ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. పాత విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించారని, ప్రస్తుతం విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సర్దుబాటు చేసేందుకు అవకాశం ఉందని ఎంఈవో అంజయ్య తెలిపారు.

మేజరు కాల్వ శుభ్రం.. రైతుల హర్షం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఏఎమ్మార్పీ మేజరుకాల్వల్లో రెండో అతి పెద్దదైన ఇరవై వేల ఎకరాల ఆయకట్టు ఉన్న డి-25 మేజరుకాల్వ శుభ్రం కావటంతో ఆయకట్టురైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కంపచెట్లు, పొదలు, పూడికతో నిండి అధ్వానంగా తయారైన ఈ కాల్వను గత కొద్దిరోజులుగా పొక్లెయిన్‌లు పెట్టి శుభ్రం చేయించారు. ఇటీవల వరకూ నీరు సక్రమంగా మైనర్లకు వెళ్లేవి కావు. దీంతో చాలామంది రైతులు తమ పంటభూములకు ఇక నీళ్లు రావని భావించారు. ఇక చివరిభూముల సంగతి సరేసరి. కాల్వ శుభ్రంకావటంతో చివరిభూములకూ నీరు చేరుతున్నట్లు రైతులు చెబుతున్నారు.



శుభ్రంగా కనిపిస్తున్న డి-25 మేజరుకాల్వ

గొర్రెలషెడ్డు నిర్మాణంలో పంచాయతీ చేతివాటం

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గొర్రెలషెడ్డు నిర్మించుకున్న రైతుకు రావాల్సిన రాయితీ సొమ్ము రూ.20వేలు కాజేసిన ఘటన గుర్రంపోడు మండలం మక్కపల్లి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. పార్లపల్లి గ్రామానికి చెందిన ఆకనబోయిన వెంకటయ్య 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో గొర్రెలషెడ్డు నిర్మించుకున్నారు. అందుకు అతడికి ఉపాధిహామీ పథకం నుంచి రూ.54,683లు రాయితీ కింద రావాల్సి ఉంది. ఆ మేరకు ఉపాధిహామీ పథకం నిధులు మక్కపల్లి గ్రామపంచాయితీ ఖాతాకు జమయ్యాయి. గ్రామ పంచాయతీ నుంచి లబ్ధిదారుడికి రూ.34,683 మాత్రమే చెల్లించారు. మిగతా రూ.20వేలు చెల్లించాలని అడిగితే గ్రామపంచాయతీ ఖాతాలోకి చేరాయని చెప్పారని.. ఏడాదిగా ఆ డబ్బులు ఇవ్వకుండా తనను తిప్పుకుంటున్నారని బాధితుడు వెంకటయ్య వాపోయాడు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి సత్తార్‌ను వివరణ కోరగా సర్పంచులు ఉన్న సమయంలో ఇది జరిగిందని, వ్యక్తిగత కారణాల వల్ల ఇవ్వలేదని తనకు తెలిసిందని చెప్పారు. ప్రస్తుతం పంచాయతీ ఖాతాల్లో డబ్బులు లేవన్నారు.

వృద్ధుడి దారుణ హత్య

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేసి వృద్ధుడిని దారుణంగా హత్య చేసిన ఘటన మాడ్గులపల్లి మండలం నారాయణపురంలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాకునూరి కొండయ్య(63)కు ముగ్గురు కుమారులు. వారిలో ఇద్దరు గ్రామంలోనే ఉంటుండగా.. మరో కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. భార్య యాదమ్మ ఏడాదిన్నర క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చిన్న కుమారుడి ఇంట్లోనే కొండయ్య ఉండేవారు. బుధవారం సాయంత్రం ఆటోలో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఒంటరిగా ఉన్న కొండయ్యపై కత్తులతో దాడి చేశారు. దీంతో కొండయ్య గట్టిగా కేకలు వేసి, బయటకు పరిగెత్తారు. అరుపులు విన్న చుట్టుపక్కన వారు అక్కడికి వచ్చేసరికి సదరు వ్యక్తులు ఆటో ఎక్కి కన్నెకల్ మీదుగా పారిపోసాగారు. గ్రామస్థులు ఆటోను వెంబడించి కన్నెకల్ గ్రామ సమీపంలో వారిని పట్టుకున్నారు. ఆటోలో ఉన్న వారిలో ఇద్దరు పరారవగా. . మరో ఇద్దరు అనుమానితులను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. రక్తపుమడుగులో ఉన్న కొండయ్యను నల్గొండ ప్రాంతీయాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. భూ తగాదాల నేపథ్యంలో హత్య జరిగి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఘటనాస్థలాన్ని మిర్యాలగూడ సీఐ వీరబాబు, ఎస్సై కృష్ణయ్యలు పరిశీలించారు.

క్రైం రిపోర్ట్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కాల్వపల్లితండా గ్రామపంచాయతీ ఎర్రావులపాడులో బుధవారం చోటుచేసుకుంది. ఏఈ అమర్‌సింగ్, ఎస్సై పి.లోకేష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఓ రైతు పొలంలోని విద్యుత్తు నియంత్రిక ఫీజు పోయిందని గ్రామానికి చెందిన పి.గోపయ్య(44)ని ఫీజు వేయించేందుకు తీసుకెళ్లారు. నియంత్రిక నుంచి విద్యుత్తు సరఫరా నిలిపి ఫీజు వేసి, తిరిగి విద్యుత్తు నియంత్రిక నుంచి విద్యుత్తు సరఫరా ఆన్‌చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై గోపయ్య కిందపడిపోయారు. పక్కన ఉన్న వ్యక్తి కేకలు వేయడంతో.. పొలంలో పని చేస్తున్న మరో రైతు వచ్చారు. మిర్యాలగూడ ప్రాంతీయాసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు గోపయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య రఘునాథ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

రహదారి ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మిర్యాలగూడ పట్టణం: రహదారి ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. రెండో పట్టణ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నర్సరావుపేటకు చెందిన హరిబాబు తన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తుండగా.. పట్టణంలోని ఏడుకోట్లతండా సమీపంలో రోడ్డు పనులు చేస్తున్న సిబ్బంది నిలిపి ఉంచిన వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో బాధితుడికి తీవ్ర గాయం కావడంతో ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు నర్సరావుపేటకు తరలించారు. కాగా ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

చంద్రారెడ్డి మృతి బాధాకరం.. డిండి: డిండి మండలం వావిల్‌కోల్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచి పేర్వాల చంద్రారెడ్డి మృతి బాధాకరమని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. బుధవారం ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

✦ చంద్రారెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పరామర్శించారు. వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్ రావు, తిరుపతయ్య, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలని ఉత్తరాలు.. మిర్యాలగూడ పట్టణం: బీసీ విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ యువజన సంఘం రాష్ట్ర కా.ని.అధ్యక్షుడు తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో బుధవారం మిర్యాలగూడలో ముఖ్యమంత్రి కార్యాలయానికి ఉత్తరాలు పంపించారు.

ల్యాప్‌టాప్ అందజేత.. మిర్యాలగూడ పట్టణం: పట్టణంలోని సీతారాంపురానికి చెందిన పేద ఇంజినీరింగ్ విద్యార్థి ముచ్చర్ల మనీష్‌కుమార్ ఉన్నత చదువుల కోసం ల్యాప్‌టాప్ కొనే స్తోమత లేక.. ఎమ్మెల్యే బీఎల్ఆర్‌ను సంప్రదించారు. స్పందించిన బీఎల్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బత్తుల సాయిప్రసన్నకుమార్, ఈశ్వర్‌గణేష్‌లు బుధవారం మనీష్‌కుమార్ ల్యాప్‌టాప్‌ను అందించారు. వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం.. మిర్యాలగూడ పట్టణం: భాజపా జిల్లా అధికార ప్రతినిధిగా మిర్యాలగూడకు చెందిన న్యాయవాది **రాజశేఖర్ నాయక్** నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి తనకు నియామక పత్రం అందించినట్లు బుధవారం స్థానికంగా తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నిక.. త్రిపురారం: ఐద్వా సంఘం మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా దైద జానకమ్మ, అధ్యక్షురాలిగా వల్లపు చంద్రకళ, కోశాధికారిగా రాములమ్మ, వీరితో పాటు మరి కొంత మందిని కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

చేయూత.. హాలియా: మండలంలోని యాచారం జడ్పీహెచ్‌ఎస్‌కు లయన్స్ క్లబ్ నల్గొండ, స్నేహ క్లబ్ ఆధ్వర్యంలో రూ.70 వేల విలువ గల సామగ్రి అందజేశారు. బుధవారం వారు పాఠశాలకు సామగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగిరెడ్డి, స్నేహక్లబ్ అధ్యక్షుడు సరళావెంకటరెడ్డి, లయన్స్ క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరికలు.. మిర్యాలగూడ పట్టణం: వివిధ పార్టీల అనుబంధ సంఘాలకు చెందిన ఎఫ్సీఐ హమాలీ కార్మికులు బుధవారం మిర్యాలగూడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి సమక్షంలో సీఐటీయూలో చేరారు. వారందరికీ రంగారెడ్డి ఎర్ర కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు.